VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 04 ఫిబ్రవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 166

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల



రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి

యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు

తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి

2లో

**యూరియా యాప్‌తో తొలగిన కష్టాలు**

**వెల్లడించిన వ్యవసాయ శాఖ**

## మేడారం జాతర విజయవంతం



ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం

ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి

మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క

2లో

రోడ్డు నిబంధనలు పాటిస్తామని

## ప్రతిజ్ఞ హామీ

రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన

ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్



2లో



# మన సహనమే విజయానికి బాట

**విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం**

**అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది**

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ**

**ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు**

వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్చలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు.



3లో



2లో

## దేశ గోప్యతను అడ్డుకోలేరు

వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ

ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు.



3లో

## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

ఉచితాలను ప్రకటించడానికి కాదు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



3లో

**మరోమారు ఝలక్ ఇచ్చిన పసిడి ధరలు**

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది

తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ

ఎక్స్ వేదిగా కెటిఆర్ విమర్శలు

చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు.



2లో

## తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

202 మరణాలతో తెలంగాణ రెండో స్థానం

దేశ వ్యాప్తంగా మొత్తం 1,075 మంది మృతి




2లో

## భారత్ రష్యా వ్యూహాత్మక భాగస్వామి

చమురు దిగుమతులపై చర్చ జరగలేదు

చమురు కొనుగోలు నిలిపివేస్తారన్నది అవాస్తవం

డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా




2లో

వేగుచుక్క

# మహిళల స్వేచ్ఛను కాపాడేందుకు కఠిన చర్యలు.







**ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ స్టేట్ హెడ్ డా. కవితా రెడ్డి.**

**మహిళలు ఎదుర్కొంటున్న సైబర్ సమస్యపై గాంధీభవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం.**

**పాల్గొన్న ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

మహిళలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచే హక్కును కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ స్టేట్ హెడ్ డా. కవితా రెడ్డి అభిప్రాయపడ్డారు . సైబర్ నేరాలను అరికట్టేందుకు చట్టాలను మరింత బలపరచాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సైబర్ బెదిరింపుల సమస్యపై గాంధీభవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ప్రముఖ బాలల హక్కుల కార్యకర్త శాంతా సిన్హా, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ స్టేట్ హెడ్ డా. కవితా రెడ్డి ప్రసంగించారు. సోషల్ మీడియా వేదికగా, మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వేధింపులు, బెదిరింపులు ప్రజాస్వామ్య విలువలకు ప్రమాదంగా మారుతున్నాయని డా. కవితా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రత, అవగాహన కార్యక్రమాలు, డిజిటల్ ప్లాట్‌ఫాంల బాధ్యత, ప్రభుత్వ పాత్రపై డాక్టర్ కవితారెడ్డి కీలక సూచనలు చేశారు. సైబర్ బెదిరింపుల అంశంపై సమిష్టి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని సమావేశంలో నిర్ణయించారు.

# సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

హైదరాబాద్:ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని
విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

న్యూఢిల్లీ: అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని,
నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

# చదువే ఆయుధంగా.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

**విద్యార్థి దశలో కష్టపడితే... జీవితమంతా సుఖ సంతోషాలే.**

**బీసీ వసతి గృహ విద్యార్థులకు 'ప్రేరణ' కల్పించిన కలెక్టర్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 03**







: విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులకు పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. ఉన్నత చదువు చదివి జీవితంలో స్థిరపడేందుకు పదవ తరగతి మొదటి మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు అన్ని విధాలా సంసిద్ధులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం వసతి గృహాల్లో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు.

వార్షిక పరీక్షలు సమీపించినందున చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాల వైపు దృష్టి పెడితే విలువైన సమయాన్ని కోల్పోతారని అన్నారు. చదువు కష్టంగా అనిపించిన ప్రతీసారి తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకుని మరింత కసి, పట్టుదలతో చదవాలని హితబోధ చేశారు. పాఠాలను బట్టీ పట్టకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే అది జీవితాంతం పనికి వస్తుందని ఉద్బోధించారు. ముఖ్యంగా బాలికలు మరింత పట్టుదలతో రాణించాలని, తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ బడుల్లో చదివే వారు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండరని విద్యార్థుల్లో కలెక్టర్ ఆత్మవిశ్వాసం కల్పించారు. చక్కగా చదువుకుని అందరూ 10 గ్రేడ్ పాయింట్స్ సాధించాలని, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. పది పరీక్షల్లో ప్రతిభను చాటితే బిగ్ స్క్రీన్ పై టి.20 వరల్డ్ కప్ లైవ్ మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేయిస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.

పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సమయం ఏమాత్రం వృధా

కాకుండా విద్యార్థులకు పునఃశ్చరణ జరిపించాలని ఉపాధ్యాయులకు, సంక్షేమ వసతి గృహాల నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. చక్కటి వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునేందుకు వీలుగా అనువైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న, వసతి గృహాల నిర్వాహకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మరోమారు ఝలక్ ఇచ్చిన పసిడి ధరలు

హైదరాబాద్ తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

# రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

న్యూఢిల్లీ ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై
చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ, వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్దరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం
నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకోంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది.మరోవైపు కాంగ్రెస్ నేతలు పార్లమెంటరీ పార్టీ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్ష, అధికార పక్షాల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ఇకపై పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన ప్రశ్నలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 03**



: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరు కానున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య జిల్లా అధికారులతో కలిసి మంగళవారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని సీ.ఎం సభా స్థలిగా ఖరారు చేసిన నేపథ్యంలో కలెక్టర్ , సీ.పీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, వేదిక తదితర వాటి ఏర్పాట్లను నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీ.ఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్.ఈ సర్దార్ సింగ్, ట్రాన్స్కో ఎస్.ఈ రాజేశ్వర్, ఆర్టీసీ ఆర్.ఎం జ్యోత్స్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ తదితరులు ఉన్నారు.

# మన సహనమే విజయానికి బాట



న్యూఢిల్లీ: ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని (ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ
పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు.

# ఆకాశాన్ని అంటింది



'కేజీఎఫ్', 'కాంతార' చిత్రాలతో కన్నడ సినిమాలకి మంచి క్రేజ్ పెరిగింది. కన్నడ మేకర్స్ సినిమాను చుట్టేస్తారు అనే మాట ఈ రెండు చిత్రాలతో చెరిగిపోయింది. ఇప్పుడు అక్కడ కూడా భారీ బడ్జెట్, పాన్ ఇండియా చిత్రాలు తెరకెక్కుతున్నాయి. హీరోల పారితోషికాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. యశ్, రిషబ్ శెట్టి లాంటి స్టార్లు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందటంతో వాళ్ల పారితోషికాలు ఊహకు అందనంత పెరుగుతున్నాయి. 'కేజీఎఫ్' తరవాత యశ్ గ్రాఫ్ పూర్తిగా మారిపోయింది. 'కేజీఎఫ్ 2' కోసం దాదాపు రూ.50 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకున్నారని టాక్. 'టాక్సిక్' కోసం అటూ ఇటుగా రూ.75 కోట్లు అని శాండల్ వుడ్లో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు రిషబ్ శెట్టి కూడా ఈ మార్క్ కు చేరుకొన్నాడు.

తెలుగులో తెరకెక్కుతున్న 'జై హనుమాన్' సినిమా కోసం రిషబ్ రూ.80 కోట్లు డిమాండ్ చేశాడని తెలుస్తోంది. యశ్‌తో సితార సంస్థ ఓ చిత్రాన్ని కమిట్ అయింది. అశ్విన్ గంగరాజు దీనికి దర్శకుడు. ఈ సినిమాకూ అటూ ఇటుగా రూ.80 కోట్లు డిమాండ్ చేసాడని తెలుస్తోంది. 'కాంతార' తో రిషబ్ కి పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు దక్కింది. 'కాంతార 2' దాదాపు రూ.300 కోట్లు సాధించింది. అందుకే ఇప్పుడు రిషబ్ శెట్టి పారితోషికం కూడా రెట్టింపు అయ్యిందని టాక్. 'కాంతార'తో రిషబ్ శెట్టి కి తెలుగులో మార్కెట్, అభిమానుల సంఖ్య పెరిగింది. అతని చిత్రాలకు మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. దాంతో నిర్మాతలు కూడా రిషబ్ అడిగినంత ఇవ్వడానికి రెడీ అవుతున్నారని ఫిలిం నగర్లో వినిపిస్తోంది. తాజాగా తెరకెక్కుతున్న 'జై హనుమాన్' బడ్జెట్ రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ తో రూపొందుతోంది.

సితార ఎంటర్టైన్మెంట్స్ లో తెరకెక్కుతున్న సినిమా కూడా పెద్ద బడ్జెట్ సినిమానే. ఈ రెండింటిలో 'జై హనుమాన్' ముందుగా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ రెండు సినిమాల్లో ఏది హిట్ అయినా రిషబ్ రూ.100 కోట్ల హీరోల జాబితాలో చేరిపోతాడు. అదే జరిగితే .100 కోట్ల పారితోషికం అందుకొన్న తొలి కన్నడ హీరోగా రిషబ్ పేరు నిలిచిపోతుంది.

# అన్నతో సినిమా




'కమిటీ కుర్రాళ్లు' సినిమా సక్సెస్‌తో మంచి జోరు మీదున్నారు కొణిదెల నిహారిక. ఆ సినిమా పలు విభాగాలలో గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను అందుకుంది. ఆ ఉత్సాహంతో మరిన్ని ప్రాజెక్స్ చేయడానికి ఆమె సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా సంగీత్ శోభన్ తో 'రాకాస' మూవీని నిహారిక నిర్మించింది. అది ఏప్రిల్ 3న విడుదల కాబోతోంది. ఇదిలా ఉంటే... ఇటీవల యదు వంశీ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే! ఇప్పుడామె నుంచి మరో క్రేజీ వార్త బయటకు వచ్చింది. తన సోదరుడు వరుణ్ తేజ్‌తో ఓ సినిమా నిర్మించడానికి రెడీ అయిందని తెలిసింది. ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' చిత్రంలో నటిస్తున్నారు. మేర్లపాక గాంధీ ఈ చిత్రానికి దర్శకుడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ఏడాది వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా తర్వాత వరుణ్ రెండు చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అందులో ఒకటి నిహారిక నిర్మించనున్నారని తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుందని సమాచారం. వరుణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రెండు చిత్రాల్లో ఒకదానికి అట్లీ దగ్గర అసోసియేట్‌గా పనిచేసిన బాలాజీ దర్శకత్వం వహించనుండగా, స్టోన్ బెంచ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మించనుంది.


# మరో సారి

స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి రూపొందిస్తున్న భారీ చిత్రంలో ప్రముఖ నటి సాయి పల్లవి హీరోయిన్‌గా ఎంపికైంది. సోమవారం చిత్ర నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. గతంలో బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2'లో ధనుష్, సాయి పల్లవి జోడీకి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఈ హిట్ కాంబో రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిలింస్, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న సంస్థల్లో ఒకటి. తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా సాయి పల్లవికి స్వాగతం పలుకుతూ, “ఆమె అందం, శక్తి రెండింటి కలబోత. అందరి ఫేవరెట్ సాయి పల్లవికి డి55 టీంలోకి స్వాగతం. హిట్ కాంబో మళ్లీ వెండితెరపైకి వస్తోంది” అని పోస్ట్ చేసింది. గతంలో ధనుష్, సాయి పల్లవి కలిసి బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2' చిత్రంలో నటించారు. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, ముఖ్యంగా 'రౌడీ బేబీ' పాట ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో ఈ హిట్ జోడీ మళ్లీ తెరపై సందడి చేయనుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో ఇప్పటికే మరో కథానాయికగా యువతరం క్రేజీ హీరోయిన్ శ్రీలీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. జనవరి 30న ఆమెను టీంలోకి ఆహ్వానిస్తూ మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఇద్దరు ప్రముఖ హీరోయిన్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరితో పాటు యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్‌ను ఈ చిత్రానికి సంగీత దర్శకుడి వ్యవహరిస్తున్నాడు. దీనిపై సాయి అభ్యంకర్ స్పందిస్తూ, ధనుష్‌తో పనిచేయడం ఒక కల అని, ఇది చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని ఒక భారీ దృశ్యకావ్యంగా (మాగ్నమ్ ఓపస్) నిర్మిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. వండర్‌బార్ ఫిలింస్‌తో పాటు ఆర్ టేక్ స్టూడియోస్ కూడా ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామిగా చేరినట్లు ఇటీవలే ప్రకటించారు.



# ప్రశంసలు





టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్ హీరోగా నటించిన లేటెస్ట్ లవ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ' కపుల్ ఫ్రెండ్లీ ' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ప్రేమ, యువత ఆలోచనలు, ఆధునిక సంబంధాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం వాలెంటైన్స్ డే స్పెషల్‌గా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సంతోష్ శోభన్ సరసన మానస వారణాసి హీరోయిన్‌గా నటించగా, రాజీవ్ కనకాల, యోగిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది. చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో లివింగ్ రిలేషన్‌షిప్ కాన్సెప్ట్‌ను కేంద్రంగా చేసుకుని తెరకెక్కిన ఈ ట్రైలర్, నేటి యువత జీవితాలను ప్రతిబింబించేలా ఉంది. పెళ్లి ఒత్తిడి నుంచి తప్పించుకుని నగరానికి వచ్చిన అమ్మాయి, తండ్రితో విభేదాల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చిన అబ్బాయి... ఇద్దరూ కలిసి ఒకే రూమ్ షేర్ చేసుకోవడం నుంచి కథ మొదలవుతుంది. మొదట ఫ్రెండ్స్‌గా మారిన వీరు, ఆ తర్వాత ప్రేమలో పడటం, రిలేషన్‌షిప్‌ను మెయింటెయిన్ చేయడం వంటి అంశాలను సరదాగా, సహజంగా చూపించారు.

# ఫిక్స్ చేసేశాడా





నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం 'ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానుంది. తదుపరి నాని సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. పూర్తిగా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. దీనికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారైనట్లు సమాచారం. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది రెండో భాగంలో మొదలుకానుంది. ప్రస్తుతం చిత్ర బృందం నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంపికలో నిమగ్నమై ఉంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి నో వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాలో నాని సరసన పూజా హెగ్డే కథానాయికగా నటించనుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలిసింది. ప్రస్తుతం నాని ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉండటం వల్ల సుజీత్ స్క్రిప్ట్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇందులో మలయాళస్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేక ఆకర్షణ.

# నిజమైన గ్రేస్

అలనాటి తార కల్పనా అయ్యర్ మరోసారి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించారు. 45 ఏళ్ల క్రితం బాలీవుడ్‌ను ఊపేసిన 'అర్మాన్' (1981) సినిమాలోని 'రంభ హో' పాటతో అప్పట్లో యువతను ఉర్రూతలూగించిన ఈ నటి.. తాజాగా ఒక పెళ్లి వేడుకలో అదే పాటకు స్టెప్పులేసి ఆశ్చర్యానికి గురి చేశారు. ఏకంగా 70 ఏళ్ల వయసులోనూ ఆమె చూపించిన ఎనర్జీ, ఫిట్‌నెస్, గ్రేస్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఏజ్ జస్ట్ ఏ నంబర్ అనే మాటకు కల్పనా అయ్యర్ సరైన ఉదాహరణ అంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. 1981లో విడుదలైన 'అర్మాన్' సినిమాలోని 'రంభ హో' పాట అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ పాటలో కల్పనా అయ్యర్ అందం, డాన్స్ మూమెంట్స్, ఎక్స్‌ప్రెషన్స్ ఆమెను ఓవర్‌నైట్ స్టార్‌గా మార్చాయి. ఆ కాలంలో ఐటమ్ సాంగ్స్‌కు ఇంత క్రేజ్ ఉండేది కాదు. అయినా సరే, కల్పనా అయ్యర్ ఆ పాటతో ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఇప్పుడు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత, అదే పాటకు ఆమె మళ్లీ నృత్యం చేయడం అభిమానులకు నాస్టాల్జియా ఫీలింగ్‌ను తీసుకొచ్చింది. వయసును లెక్కచేయకుండా, కాన్ఫిడెన్స్‌తో స్టెప్పులేయడం అక్కడున్న అతిథులను మంత్ర ముగ్ధులను చేసింది. కల్పనా అయ్యర్ డాన్స్ వీడియోపై నెటిజన్లు ప్రశంసల కురిపిస్తున్నారు. '70 ఏళ్ల వయసులోనూ ఇంత ఎనర్జీనా! నిజమైన స్టైల్, నిజమైన గ్రేస్ అంటే ఇదే.. మళ్లీ పాత రోజులు గుర్తొచ్చాయి' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'ఇప్పటి హీరోయిన్స్ కూడా ఇంత గ్రేస్ చూపించలేరు' అంటూ మరికొందరు ప్రశంసిస్తున్నారు. కల్పనా అయ్యర్ కేవలం ఒక ఐటమ్ సాంగ్‌తోనే కాదు, తన డిసిప్లిన్, ఫిట్‌నెస్, లైఫ్‌స్టైల్‌తో కూడా ఇప్పటి తరం మహిళలకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తున్నారు.



# తప్పుకున్న డెకాయిట్

ఒకప్పుడు ఒక సినిమా వాయిదా పడింది అంటే అది అపశకునం అని ఫీల్ అయ్యేవారు. కానీ, ఇప్పుడు అది ఒక ట్రెండ్‌గా మారి పోయింది. మేకర్స్ చెప్పిన టైమ్ కి సినిమా రిలీజ్ అయితే అదే విశేషంగా మారుతోంది. మేకర్స్ చెప్పిన టైమ్‌కి సినిమా రిలీజ్ అయితే అదే విశేషంగా మారుతోంది. కొన్ని సినిమాలు అయితే వాయిదాల మీదనే నడుస్తున్నాయి అని చెప్పొచ్చు. అలాంటి సినిమాల లిస్ట్ లో డెకాయిట్ కూడా చేరింది. అడివి శేష్ హీరోగా షానెయిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తోంది. ఇక ఈ మూవీలో శేష్ సరసన మృణాల్ ఠాకూర్ నటిస్తోంది. ఇప్పటికే డెకాయిట్ నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు హైప్ కూడా పెంచేశాయి.

అన్ని బావుండి ఉంటే డెకాయిట్ గతేడాది క్రిస్మస్ కే రావాల్సింది. కానీ, మొదట హీరోయిన్ గా నటించిన శ్రుతి తప్పుకోవడం, ఆ సీన్స్ ని మళ్ళీ మృణాల్‌తో చేయించడంతో లేట్ అయ్యింది. అంతా ఓకే అనుకొని షూటింగ్ మొదలుపెట్టిన కొన్నిరోజులకే శేష్ కి సెట్ లో ప్రమాదం జరగడం, రెస్ట్ తీసుకోవడంతో షూటింగ్ ఫినిష్ కాలేదు. దీంతో క్రిస్మస్ నుంచి సమ్మర్ కి వాయిదా వేశారు. మార్చి 19 న పక్కాగా వస్తామని శేష్ బల్లగుద్ది మరీ చెప్పాడు. అయితే ఇప్పుడు ఆ డేట్ నుంచి కూడా డెకాయిట్ తప్పుకున్నట్లు తెలుస్తోంది.

డెకాయిట్ మరోసారి వాయిదా పడినట్లు సమాచారం. దానికి కారణం మార్చి 19నే పాన్ ఇండియా సినిమా ధురంధర్ 2 రిలీజ్ కానుంది. గతేడాది రిలీజ్ అయిన ధురంధర్ పార్ట్ 1 భారీ విజయాన్ని అందుకుంది. సెకండ్ పార్ట్ పై కూడా అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఇదే కాకుండా అదే రోజున యష్ టాక్సిక్ కూడా రానుంది. మొదట టాక్సిక్ కూడా వాయిదా పడుతుందేమో అనుకున్నారు. కానీ, అనుకున్న సమయానికే యష్ వస్తున్నట్లు సమాచారం. ఇక ఈ రెండు పెద్ద సినిమాల మధ్య నలిగిపోవడం ఎందుకని, డెకాయిట్ పక్కకి జరిగినట్లు టాక్. మార్చి 19 పోతే ఇంకెప్పుడు డెకాయిట్ వస్తోంది అంటే ఏప్రిల్ 10న వచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. త్వరలోనే మేకర్స్ ఈ డేట్ ను అధికారికంగా అనౌన్స్ చేయనున్నారని టాక్. ఇక ఈ విషయం తెలియడంతో శేష్ మంచి నిర్ణయమే తీసుకున్నాడని అంటున్నారు. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాలి.

